శ్రీగిరి.. భక్తజనసంద్రం

● పాదయాత్రతో శ్రీశైలం చేరుకున్న భక్తులు ● ఇరుముడులు సమర్పించిన శివమాల ధారులు ● మల్లన్న దర్శనంతో పరవశం

శ్రీగిరి భక్తజన సంద్రమైంది. శివ మాలధారులు.. కాలినడక భక్తులు.. వాహనాల్లో తరలి వచ్చిన వారితో శ్రీశైలం కిక్కిరిసింది. వందల కిలోమీటర్ల దూరం నుంచి పాదయాత్రగా వచ్చిన భక్తులు మల్లన్న దర్శనంతో అలసట మరిచిపోయి పరవశించిపోయారు. కొందరు ధూళి దర్శనం చేసుకుని ఇరుముడులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. శివనామ స్మరణతో తన్మయత్వం పొందుతున్నారు.


ఇరుముడులతో దర్శనానికి వెళ్తున్న శివమాల ధారులు


పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించేందుకు పోటెత్తిన భక్తజనం

ఆత్మకూరు: మహా శివరాత్రి నాడు మల్లన్నను దర్శించుకునేందుకు భక్తులు శ్రీశైలం తరలివస్తున్నారు. శివ మాలధారులు తమ కుటుంబ సభ్యులతో పాదయాత్రగా మల్లన్న సన్నిధిని చేరుకుంటున్నారు. పంచాక్షరి నామ స్మరణ పఠిస్తూ చెట్లు, పుట్టలు, కొండలు, కోనలు దాటుకుని ఇల కైలాసం చేరుకుంటున్నారు. భక్తుల శివనామ స్మరణ, ఓంకార ప్రణవనాదాలతో నల్లమల అటవీ ప్రాంతం ప్రతిధ్వనిస్తోంది. శ్రీశైల మహాక్షేత్రానికి పాదయాత్రతో వచ్చామని స్వామి వారికి తెలియజేయాలని సాక్షిగణపతికి తమ గోత్రనామాలు చెప్పి శ్రీశైలం చేరుకుంటున్నారు. శివమాల ధారులు.. తమకు ప్రత్యేకంగా కేటాయించిన క్యూల ద్వారా స్వామివార్ల అలంకార దర్శనాన్ని చేసుకుని భ్రమరాంబాదేవిని దర్శించుకుని శివదీక్షా శిబిరాలలో సేద తీరుతున్నారు. అలాగే దేవస్థానం ఏర్పాటు చేసిన గుడారాలు, షామియానాలలో కాసేపు కునుకు తీస్తున్నారు. ఇరుముడి సమర్పించిన స్వాములతో పాటు మహాశివరాత్రి పర్వదినాన జ్యోతిర్ముడులను సమర్పించాలని భావిస్తున్న స్వాములతో పాటు వారితో వచ్చిన కుటుంబ సభ్యులు శివరాత్రి ఘడియల కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు భక్తులు కిలో మీటర్ల కొద్ది నడిచి వచ్చి అలాగే ధూళీ దర్శనం చేసుకుని అలసట మరిచిపోయి ఆధ్యాత్మికానందాన్ని పొందుతున్నారు. ఈఏడాది బాల స్వాముల సంఖ్య భారీగా ఉంది. 3 ఏళ్ల నుంచి 12 ఏళ్లలోపు వయస్సున్న 12వేల మందికి పైగా శివమాల ధరించిన బాలలు ఇప్పటికే శ్రీశైలం చేరుకుని ఇరుముడిని సమర్పించారు.

పచ్చ బొట్లపై భక్తుల మక్కువ

పలువురు భక్తులు పచ్చబొట్లు వేయించుకోవడానికి పోటీపడ్డారు. ధ్యాన ముద్రలో ఉన్న శివుడు, నాట్యం చేస్తున్న శివుడు, ఓం తదితర సింబల్స్‌ను రూ.200 నుంచి రూ.500 వరకు చెల్లించి తమ ఒంటిపై వేయించుకున్నారు. పాతాళ గంగ, నంది సర్కిల్, బస్టాండ్, పీహెచ్‌సీ రోడ్డు, శివ సదనం ప్రాంతాల్లో పచ్చబొట్లు వేసే వారు బిజీగా కనిపించారు. అలాగే శ్రీశైల క్షేత్రంలో పుంజుకుంటున్నాయి. ఈ ఏడాది వెండిని తలపించే సిల్వర్‌తో తయారైన వస్తువులు మహిళలను, బాలికలను ఆకట్టుకున్నాయి.



గజవాహన సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా, ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న, పచ్చ బొట్టు వేయించుకుంటున్న శివ భక్తుడు

భక్తులకు సౌకర్యాలు భేష్

పాదయాత్ర భక్తులకు దేవస్థానం కల్పించిన సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. హఠకేశ్వరం, కైలాసద్వారం ప్రాంతాలను శుక్రవారం ఆయన సందర్శించారు. వచ్చే ఏడాది శివరాత్రి నాటికి కైలాసద్వారం వద్ద ప్రత్యేక మైకులు ఏర్పాటు చేసేలా దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. భీమునికొలను మెట్ల వెంట కైలాసద్వారం వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలు, వైద్యశిబిరాలు, మజ్జిగ కేంద్రాలు ఎంతగానో భక్తులకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, రజాక్ ఉన్నారు.


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాములపాడు: యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా మానవ వనరుల కేంద్రం ఏఓ హేమలత, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డిలు రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రం పరిధిలోని మొక్కజొన్న పైరులో వారు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, మినుము, పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. మొక్కజొన్నను ఆశించిన కత్తెర పురుగు, మినుము పైరులో కాండపు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

సర్వేను పూర్తిచేయండి

కొత్తపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్‌డీజీ సర్వేను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయన్న విషయాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తహీనత ఉన్న 10 నుంచి 19 ఏళ్ల బాలబాలికలు, రక్తహీనతతో బాధ పడుతున్న గర్భిణులు తదితర వివరాలను సోమవారం లోపు పూర్తి చేయాలన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

ఆత్మకూరు రూరల్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి వి.రఘునాథ్‌ను పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన స్థానంలో ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన తిరుపతికి చెందిన పీజే తేజసాయిని నియమించారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం


రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. రెడ్‌క్రాస్ నిర్వాహకులు నాగశేషయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు, భక్తులకు అందిస్తున్న వైద్య సేవల గురించి శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఆరా తీశారు. కైలాస ద్వారం వద్ద ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రెడ్‌క్రాస్ శిబిరాన్ని సందర్శించి భక్తులకు మందులను పంపిణీ చేశారు. 24 గంటల పాటు వైద్యసేవలను అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు.

వైద్య రంగానికి పెద్దపీట

వెలుగోడు: వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. శుక్రవారం వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులకు, గర్భిణులకు కావాల్సిన సదుపాయాల కల్పనకు నిధులు ఖర్చు చేయడానికి తీర్మానించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ వంశీకృష్ణ, సర్పంచ్ సర్దార్ మియా, ఎంపీటీసీ సభ్యులు వెంకటరామిరెడ్డి, జనాబ్ రెడ్డి పాల్గొన్నారు.

20న రాష్ట్రస్థాయి పాల బండ లాగుడు పోటీలు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో శివరాత్రి సందర్భంగా ఈ నెల 20న రాష్ట్ర స్థాయి పాల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నందీశ్వర స్వామి రైతు సంఘం సభ్యులు శుక్రవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన ఎడ్ల యజమానులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40,016, రెండవ బహుమతి రూ.25,016, మూడవ బహుమతి రూ.15,016, నాల్గవ బహుమతి రూ.10,016, ఐదవ బహుమతి రూ.5,016, ఆరవ బహుమతి రూ.3,016 చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9866513812, 9550561950, 6304850031, 9704057249లను సంప్రదించాలన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్ దంపతులు, సభ్యులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ధర్మకర్తల మండలి తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. శుక్రవారం పట్టువస్త్రాలతో ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపక్షయ్యస్వామి, గురుమహాంత్ ఉమామహేష్, ఎం.విజయలక్ష్మి, బి.రాజేశ్వరి, ఎ.లక్ష్మీసావిత్రమ్మ, మధుసూదన్‌రెడ్డి, సూరిశెట్టి మాధవీలత, సి.కనకదుర్గలకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు, ధర్మకర్తల మండలి తరఫున తీసుకువచ్చిన పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

మహానందికి ఉత్సవ శోభ



మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది ఆలయ గోపురాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ గర్భాలయం, రాజగోపురం, ముఖద్వారం, మహాద్వారం, సుపథ మండపాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

అన్నప్రసాదాల వితరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని అఖిల భారత శ్రీశైల కుమ్మర శాలివాహన నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో శుక్రవారం హఠకేశ్వరం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు హఠకేశ్వరం వద్ద కుమ్మరి కేశప్ప జ్ఞాపకార్థం అన్నప్రసాదం అందజేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని సత్రం కమిటీ అధ్యక్షులు బండారి భిక్షపతి, ప్రధాన కార్యదర్శి కుమ్మర లక్ష్మన్న, కోశాధికారి బొమ్మిన శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.


భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న సత్రం నిర్వాహకులు


భక్తులకు అన్నదానం చేస్తున్న పీఠాధిపతి శ్రీ రామానందస్వామి

జూటూరు సమీపంలో..

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో శ్రీనాగసాయి బ్రహ్మ విద్యా ఆశ్రమం వద్ద శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు పీఠాధిపతి శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. శివరాత్రి పండుగ వరకు కొనసాగిస్తామని పీఠాధిపతి తెలిపారు.

వ్యక్తికి గాయాలు

మిడుతూరు: ఆగివున్న ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నందికొట్కూరు పట్టణం హాజీనగర్ కాలనీకి చెందిన మౌలాలి మిడుతూరుకు ద్విచక్ర వాహంపై వెళ్లాడు. పని ముగించుకుని నందికొట్కూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. సమ్మర్ స్టోరేజ్ సమీపంలోకి రాగానే పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో మౌలాలికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నందికొట్కూరు ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు

● 19న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

కొత్తపల్లి: మండల పరిధిలోని సంగమేశ్వరాలయంలో శనివారం నుంచి శివరాత్రి వేడుకలు జరగనున్నాయని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శుభకృత్ నామ సంవత్సర మాఘ బహుళ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం తెల్లవారు జామున ఆలయంలో అభిషేకం, మంగళహారతి తదితర పూజల అనంతరం భక్తులకు స్వామి వారి సర్వ దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరపనున్నామన్నారు. వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందుఎన ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, స్నానాలకు వాటర్ ట్యాంకులు, తాగునీటి కులాయిలు ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరు నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతారని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.